క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ ప్రసాదరావు

పాలకొండ రూరల్: స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయం ఇన్స్పెక్టర్‌గా ఆమిటి ప్రసాదరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

తాడికొండలో గ్రామసభ


గ్రామసభలో పాల్గొన్న ఎంపీడీవో త్రివిక్రమరావు

గుమ్మలక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వ పథకమైన ఆదికర్మ యోగిపై అవగాహన కల్పిస్తూ మండలంలోని తాడికొండ గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.త్రివిక్రమరావు పాల్గొని, పథకం వివరాలు తెలియజేశారు. 2030లోగా గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తోందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.జగ్గారావు, మాజీ సర్పంచ్ ఎ.కుసుమమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని ఐటీడీఏ పీవో పవర్ స్వప్నిల్ జగన్నాథ్ సూచించారు. ఇదే విషయమై స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో సోమవారం సమావేశమై, పలు సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ఆదికర్మ యోగి పథకం ప్రణాళికలు రూపొందించి, అమలుచేయాలన్నారు. ఆయన వెంట ఏపీవో చిన్నబాబు తదితరులు ఉన్నారు.

మద్యంసీసాలు స్వాధీనం


పట్టుబడిన మద్యంసీసాలు చూపిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

భామిని: మండలంలోని ఎం.కె.పురంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం అమ్మకాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి నుంచి 9 మద్యంసీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటరాజు తెలిపారు. ఎవరైనా ఎక్కడైనా అక్రమంగా మద్యం అమ్మినా, తరలించినా సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఎరువుల షాపు తనిఖీ


ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న తహసీల్దారు

భామిని: మండల కేంద్రంలోని ఎరువుల షాపును తహసీల్దారు శివన్నారాయణ సోమవారం తనిఖీ చేశారు. ఎరువుల కోసం వచ్చే రైతుల కోసం కనీసం తాగునీటి సదుపాయం కూడా ఏర్పాటు చేయకపోవడంపై షాపు యజమానిని ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే ఎరువులు విక్రయించాలని, ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జాతీయ పోటీలకు విద్యార్థిని ఎంపిక


చైత్రికా కృష్ణ

పాలకొండ రూరల్: జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాపోటీలకు మండలంలోని డీఏవీ పాఠశాల పదో తరగతి విద్యార్థి బొడ్డేపల్లి చైత్రికా కృష్ణ ఎంపికయ్యారు. ఇటీవల రాజాం జీఎంఆర్ ఐటీ కళాశాలలో జరిగిన అఖిల భారత డీఏవీ పాఠశాలల అండర్-15 బ్యాడ్మింటన్ పోటీల్లో ఆమె సత్తా చాటడంతో జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. అక్టోబరులో ఢిల్లీలో జరిగే పోటీల్లో ఆమె పాల్గొంటుండగా, ఈ మేరకు ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి, తదితరులు సదరు విద్యార్థినిని అభినందించారు.

వేతనాలు విడుదల చేయాలి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకుడు సాంబమూర్తి

కొమరాడ: గ్రీన్ అంబాసిడర్ల వేతనాలను వెంటనే విడుదల చేసి వారికి అందివ్వాలని సీఐటీయూ నాయకుడు కొల్లు సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన పలువురు గ్రీన్ అంబాసిడర్లతో కలిసి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల పారిశుద్ధ్యంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న చిన్న కార్మికులైన గ్రీన్ అంబాసిడర్ల జీతాలను నెలల తరబడి నిలిపివేయడం సరికాదన్నారు. ఇలా అయితే వారెలా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణమే వారి వేతనాలు వారికి అందించాలని విజ్ఞప్తి చేశారు.

‘అన్నదాత పోరు’ను విజయవంతం చేయండి

- నేడు అన్ని ఆర్‌డీవో కార్యాలయాల వద్ద అన్నదాత పోరు కార్యక్రమం
- రైతులకు బాసటగా నిలవాలని వైఎస్సార్ సీపీ నాయకుల పిలుపు

పాలకొండ: ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై రైతన్నకు బాసటగా నిలుస్తూ వైఎస్సార్ సీపీ మంగళవారం చేపడుతున్న అన్నదాత పోరు కార్యక్రమానికి ప్రతిఒక్కరూ విచ్చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిలు పిలుపునిచ్చారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలోని పాలవలస రాజశేఖరం నివాసంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజలు కష్టాలను ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా రైతులను యూరియా కష్టాలు వీడడం లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత ఏర్పడిందని, దీంతో రైతులు ఎరువుల కోసం పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అన్నదాత సంక్షేమం పట్టని కూటమి నాయకులు కొందరు.. ఎరువులను బ్లాక్‌మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. కొన్ని రోజులుగా రోడ్లపై రైతులు పడుతున్న కష్టాలు చూస్తుంటే జాలి వేయడం లేదా అని ప్రశ్నించారు. ఓటేసిన పాపానికి ఇలానే నడిరోడ్డుపై నిల్చోబెడతారా అని రైతాంగం అడుగుతోందని, దీనికి సీఎం చంద్రబాబు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. రైతులు పడుతున్న యూరియా కష్టాలు ప్రభుత్వానికి పట్టడం


పాలకొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

లేదా అని ధ్వజమెత్తారు. ఒక రైతుకు ఒక బస్తా యూరియా కూడా ఇప్పుడు దొరకని పరిస్థితి ఉందని, రాష్ట్రంలోని రైతులంతా రోడ్డెక్కి ఆందోళన చేపట్టే స్థితి మన రాష్ట్రంలో చూడాల్సి వస్తుందని అనుకోలేదన్నారు. అధికారం ఉన్నా లేకున్నా రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ఎప్పుడూ ఉంటుందని, రైతుల ఎరువుల సమస్యలపై మండల కేంద్రంలో జరిగే అన్నదాత పోరు కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, రైతులంతా రావాలన్నారు. కూటమి మెడలు వంచైనా యూరియాను తెప్పించుకుందామన్నారు. ఉదయం 10 గంటలకు కోటదుర్గమ్మ ఆలయం నుంచి సబ్‌కలెక్టరు కార్యాలయం వరకు చేపట్టే అన్నదాత పోరు కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని, అన్నదాతకు అండగా నిలవాలని కోరారు.

సీతంపేట: రైతుల యూరియా కష్టాలపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన పాలకొండ నియోజకవర్గ కేంద్రంలో జరిగే అన్నదాత పోరు కార్యక్రమానికి అందరూ తరలిరావాలని ఎంపీపీ ఆదినారాయణ కోరారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయం వద్ద అన్నదాత పోరు కార్యక్రమ వాల్‌పోస్టర్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ కన్వీనర్ మోహన్‌రావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ ఎస్.కాంతారావు, సర్పంచ్‌లు కె.వెంకునాయుడు, ఎ.కళావతి, తిరుపతిరావు, ఎంపీటీసీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


భామిని: అన్నదాత పోరు వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 9వ తేదీన చేపట్టే అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎంపీపీ డి.వెంకటరమణనాయుడు మండల కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులంతా కార్యక్రమానికి తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నింటి శ్రీను, భోగి మణి, జె.అమర్‌నాథ్, శొంట్యాన సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కురుపాం: రైతులకు యూరియా సరఫరాలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై పాలకొండ మండల కేంద్రంలో ఈ నెల 9వ తేదీన జరిగే అన్నదాత పోరు కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఎంపీపీ శెట్టి పద్మావతి సోమవారం విడుదల చేశారు. ఇదిలా ఉండగా, మండలంలోని మొండెంఖల్ గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు రైతులతో కలిసి అన్నదాత పోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శెట్టి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ నూరెల్లా, జిల్లా, మండల కో–ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: రైతుల యూరియా అవస్థల నేపథ్యంలో పాలకొండ నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం జరిగే అన్నదాత పోరు కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాశరావు, నాయకులు బంకి లక్ష్మణమూర్తి, కోట అజయ్‌కుమార్, తిర్లంగి ఉపేంద్రకుమార్, నేరడి


సీతంపేట: అన్నదాత పోరు కార్యక్రమ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ఆదినారాయణ, తదితరులు


పాలకొండ: అన్నదాత పోరు వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న పార్టీ నాయకులు


కురుపాంలో అన్నదాత పోరు వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఎంపీపీ శెట్టి పద్మావతి తదితరులు

బిల్లి ప్రసాద్, నల్లి శివప్రసాద్, లోలుగు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: రైతన్నకు యూరియా సరఫరాలో కూటమి సర్కారు విఫలం చెందిన కారణంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం పార్వతీపురంలో చేపట్టే అన్నదాత పోరు కార్యక్రమానికి తరలిరావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు కోరారు. ఇదే విషయమై మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో అన్నదాత పోరు కార్యక్రమ వాల్‌పోస్టరు సోమవారం ఆవిష్కరించారు. ఉల్లిభద్ర జంక్షన్ నుంచి పార్వతీపురం ఆర్డీవో కార్యాలయం వరకు చేపట్టే ర్యాలీలో ప్రతిఒక్కరూ భాగస్వాములై రైతులకు బాసటగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శెట్టి శ్రీనివాసరావు, తెర్లి ఎల్లంనాయుడు, అంబటి గౌరునాయుడు, గుజ్జల ఈశ్వరరావు, బూరి రమేష్, గుంట్రెడ్డి చంద్రశేఖరరావు, మరిశర్ల శ్రీను, మర్రాపు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భామిని: మండల కేంద్రంలో అన్నదాత పోరు కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తోట సింహాచలం, తదితరులు సోమవారం ఆవిష్కరించారు. పాలకొండలో మంగళవారం ఉదయం జరిగే ఈ కార్యక్రమానికి అందరూ తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి మోహనబాబు, ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్‌లు భార్గవనాయుడు, మడపాన కేశవ తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస రూరల్: యూరియా కొరతలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతులకు బాసటగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పాలకొండలో మంగళవారం జరిగే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు కోరారు. కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులంతా కార్యక్రమానికి హాజరై, రైతులకు బాసటగా నిలవాలన్నారు. అనంతరం చినమేరంగి కోటలో అన్నదాత పోరు వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.

కొమరాడ: పార్వతీపురంలో ఈ నెల 9వ తేదీన జరిగే అన్నదాత పోరు కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను మండలంలోకి విక్రంపురంలో వైఎస్సార్ సీపీ నాయకులు కళింగి మల్లేశ్వరరావు, నంగిరెడ్డి శరత్‌బాబులు సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కార్యక్రమానికి తరలివచ్చి, అన్నదాతకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మరడాన సింహాచలంనాయుడు, కెంగువ పోలినాయుడు, పైల వెంకటరమణ, సిరిపురం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కురుపాం: మొండెంఖల్ గ్రామంలో అన్నదాత పోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు, తదితరులు


గరుగుబిల్లి: ఉల్లిభద్రలో అన్నదాత పోరు వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అచ్యుతరావు, తదితరులు


జియ్యమ్మవలస రూరల్: అన్నదాత పోరు వాల్‌పోస్టర్‌లతో వైఎస్సార్ సీపీ నాయకులు


కొమరాడ: అన్నదాత పోరు వాల్‌పోస్టర్‌లతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు


వీరఘట్టం: అన్నదాత పోరు వాల్‌పోస్టర్లతో ఎంపీపీ వెంకటరమణనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

వీరఘట్టం: పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్ను వెంకటరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులతో సోమవారం సమావేశమై మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించాలని విద్యాశాఖ మంత్రిని కోరారు. పీఆర్‌సీ ప్రకటించాలని, డీఏ, సరెండర్ లీవ్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, డీఎస్సీ-2025 ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయనకు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానపాధ్యాయుడు సొంబర పాల్గొన్నారు.


వెంకటరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

13, 14 తేదీల్లో సీఐటీయూ జిల్లా మహాసభలు

పాలకొండ: స్థానిక పట్టణంలో ఈ నెల 13, 14వ తేదీల్లో సీఐటీయూ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని, అందరూ సభలకు విచ్చేసి విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో మహాసభల వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. 13వ తేదీ ఉదయం జరిగే కార్యక్రమంలో దుర్గగుడి నుంచి ర్యాలీ ఉంటుందని, తర్వాత భారీ బహిరంగ సభ నిర్వహించి ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా చేపడుతున్న విధానాలపై నినదించడం జరుగుతుందన్నారు.


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణారావు

● విరబూసిన బ్రహ్మకమలాలు



మండలంలోని తోటపల్లికి చెందిన డొల్లు గౌరునాయుడు ఇంట బ్రహ్మకమలాలు ఆదివారం రాత్రి విరబూశాయి. సృష్టికర్త బ్రహ్మదేవునికి అత్యంత ఇష్టమైన పుష్పాలుగా పిలువబడుతున్న ఇవి రాత్రి సమయాన కొన్నిగంటలు మాత్రమే వికసిస్తూ కనిపిస్తాయి. అరుదుగా కనిపించే ఈ పుష్పాలను చూసేందుకు చుట్టుపక్కల వారు ఎగబడ్డారు.

–గరుగుబిల్లి

రోడ్డెక్కితే అరెస్టులని బెదిరించడం సరికాదు

పాలకొండ రూరల్: వరిసాగును దక్కించుకునేందుకు యూరియా కోసం రైతులు ఎండనకా..వాననకా..రోడ్లపై అవస్థలు పడుతుంటే రోడ్డెక్కితే అరెస్ట్ చేస్తామని రైతులను ప్రభుత్వం బెదిరించడం సరికాదని సీపీఐ నేత, రైతు సంఘం నాయకుడు బుడితి అప్పలనాయుడు అన్నారు. రైతులకు యూరియా అందివ్వాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయానికి సోమవారం వెళ్లి, తహసీల్దారు రాధాకృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా అందివ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎక్కడికక్కడ రైతులంతా రోడ్లు ఎక్కి నిరసన చేపడుతున్నా అన్నదాతల ఘోష ప్రభుత్వానికి పట్టడం లేదా అని నిలదీశారు. పాలకొండ నియోజకవర్గం పరిధిలోని రైతులకు ప్రస్తుతం 6 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని ప్రస్తుతం 4 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే అందించారన్నారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పండిస్తున్న పంటను కీలక దశలో కాపాడుకోలేక ఏం చేయాలో తోచడం లేదన్నట్లుగా దీనంగా రైతులు ఉన్నారని, వారి కష్టాలను గుర్తించి తక్షణమే యూరియా అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు ద్వారపూడి అప్పలనాయుడు, నెల్లి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకుడు అప్పలనాయుడు

ఆలయాల్లో సంప్రోక్షణ పూజలు

గరుగుబిల్లి: చంద్రగ్రహణం వీడిన సందర్భం పురస్కరించుకుని, మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరాలయం, కోదండరామస్వామి మందిరాల్లో సోమవారం ఉదయం సంప్రోక్షణ పూజలు చేపట్టారు. ఆలయాల శుద్ధి, సంప్రోక్షణ పూజలు, నవకలశ స్నపనం, విశేష హోమం, మంగళాశాసనం, శాత్తుమురై తదితర పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ఆస్పత్రికి రోగుల తాకిడి

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. ప్రతిరోజూ అస్వస్థతకు గురైన వారు వైద్యం కోసం ఆస్పత్రికి వస్తూనే ఉన్నారు. సోమవారం మొత్తం 358 ఓపీ రాగా వారిలో 65 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. వారిలో 26 మంది ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరి వైద్య సేవలు పొందుతున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

పరామర్శ


శివప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తదితరులు

పాలకొండ రూరల్: పట్టణంలోని రజక వీధికి చెందిన విలేకరి శివప్రసాద్‌ను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పరామర్శించారు. ఇటీవల శివప్రసాద్ శస్త్రచికిత్స చేయించుకుని, ఇంటి వద్దనే కోలుకుంటున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్సీ ఉదయం ఆయన ఇంటికి వెళ్లి మరీ ఆయనను పరామర్శించి ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల, నగర పాలకవర్గ సభ్యులు వెలమల మన్మధరావు, భాసూరు కాంతారావు, కోడెం విజయ్‌కుమార్, కిల్లారి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ వితరణ

కురుపాం: మండలంలోని బియ్యాలవలస ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యస్ సొసైటీ వారు వితరణ చేసిన నోట్‌బుక్స్, స్టడీమెటీరియల్‌ను ఎంపీడీవో ఉమామహేశ్వరి చేతులమీదుగా సోమవారం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తుండడం అభినందనీయమని, విద్యార్థులంతా కల్పించబడుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, ఈవోపీఆర్‌డీ వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరి

11 నుంచి ఏపీటీఎఫ్ నిరసన

వీరఘట్టం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏపీటీఎఫ్ ఈ నెల 11వ తేదీ నుంచి నిరసన చేపడుతున్నట్లు ఆ సంఘ మండల అధ్యక్షుడు ఎం.మురళి తెలిపారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో నిరసనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. 11 నుంచి 17వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో 11న నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరుకావడం, 12న మండల కేంద్రాల్లో నిరసన తెలపడం, 13, 14న ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందివ్వడం, 15న డివిజన్ కేంద్రాల్లో ఆందోళన, 16న జిల్లా కేంద్రాల్లో ధర్నా, 17న సీఎం, సీఎస్‌లకు వాట్సాప్, ఈ-మెయిల్‌ల ద్వారా వినతిపత్రాలు అందించే కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ధనుంజయనాయుడు, రామారావు, నరహరి, నాయుడు, గౌరీశ్వరరావు, శ్రీనివాసరావు, హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

మిన్నారావు మృతికి మాజీ డిప్యూటీ సీఎం నివాళి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేదారిపురం సర్పంచ్ తాడంగి తులసమ్మ భర్త, వైఎస్సార్ సీపీ వీరాభిమాని తాడంగి మిన్నారావు(60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటించారు. ఆ గ్రామానికి వెళ్లి అయన పార్థివదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. పార్టీ పరంగా అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. ఆమె వెంట ఎంపీపీ కుంబురుక దీనమయ్య, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, కేదారిపురం మాజీ ఎంపీటీసీ సభ్యులు ఎస్.కృష్ణ, పి.మహేష్ తదితరులు ఉన్నారు.


మిన్నారావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

నేత్ర శస్త్రచికిత్సకు 66 మంది ఎంపిక

వీరఘట్టం: మండలంలోని వండువ గ్రామ జంక్షన్ వద్ద షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో సోమవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నేత్ర వైద్య తనిఖీలకు మొత్తం 220 మంది హాజరు కాగా వారిలో 66 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం తెలిపారు. ఆపరేషన్లు ఉచితంగా చేయడంతో పాటు వారికి ఉచితంగా భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హిందుస్తాన్ షిప్‌యార్డు లిమిటెడ్ చీఫ్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి డీజీఎం వి.రమేష్, క్యాంప్ కో- ఆర్డినేటర్ అప్పలరాజు పాల్గొన్నారు.


వృద్ధురాలి కంటిని తనిఖీ చేస్తున్న వైద్యురాలు